క్లుప్తంగా

విస్తృతంగా వాహనాల తనిఖీ



నందిగామరూరల్: నందిగామ పట్టణంలో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆయా గ్రామాల నుంచి ద్విచక్రవాహనాలు, ఆటోలలో రైతులు పెద్దఎత్తున తరలి వస్తున్నారనే సమాచారంతో పోలీసులు పట్టణాన్ని నలుదిక్కులా జల్లెడ పట్టారు. అంబారుపేట బైపాస్ వైజంక్షన్, చందాపురం ఫ్లైఓవర్, రామన్నపేట రోడ్డు, పాతబస్టాండ్, తదితర ప్రాంతాలలో పోలీసులు మోహరించి పట్టణంలోనికి వచ్చే ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యకర్తలు, రైతులను అడ్డుకోవడమే లక్ష్యంగా పోలీసులు విస్తృతంగా తనిఖీ చేపట్టినప్పటికీ వారు భారీగా తరలివచ్చి అన్నదాత పోరును విజయవంతం చేయడం గమనార్హం.

నానో ఎరువులపై రైతులకు అవగాహన



తోటచర్ల(పెనుగంచిప్రోలు): రైతులు తమ పంటలకు రెండోవిడతలో నానో యూరియా స్ప్రే చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.రామసుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని తోటచర్లలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నానో యూరి యా, నానో డీఏపీ ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. డ్రోన్ ద్వారా నానో యూరియా స్ప్రే చేయించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి పంటలో మొదటి విడతగా 30 కిలోల యూరియా, 30–40 రోజుల పంట దశలో 30 కిలోల యూరియా, చిరుపొట్ట దశలో 30 కిలోల యూరియా వాడాలని సూచించారు. రెండో దశలో నానో యూరియా స్ప్రే చేసుకోవాలన్నారు. మండలంలోని శనగపాడు, కొల్లికూళ్ల సొసైటీల వద్ద బుధవారం రైతులకు యూరియా కట్టలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ డీడీఏ మోసెస్ వెస్లీ, పశువైద్యాధికారి పి.అనిల్, రైతులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: నందిగామ సబ్‌డివిజన్‌లో రైతుల అవసరాల మేరకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. మండలంలోని పోచంపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సినవసరం లేదని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ భవానీ మాట్లాడుతూ రైతులు నానో యూరియా వినియోగంపై అవగహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

669 మందికి వైద్యపరీక్షలు



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ సత్రాల్లో మంగళవారం జయప్రద ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 669 మంది రోగులు పరీక్షించుకోగా వారిలో 210 మందికి కళ్లజోడులు అవసరమని వైద్యులు నిర్ధారించారు. 96మందికి త్వరలో శంకర్ కంటి ఆసుపత్రిలో చేయించనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, సొసైటీ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ, మాజీ ఎంపీపీ వేగినేటి గోసాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ 1.11లక్షలు విరాళం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పాలేటి తీరాన వేంచేసియున్న శివపంచాయతన క్షేత్రం మఠం శివాలయం పునర్నిర్మాణానికి భక్తులుఆరేపల్లి కుమార్ కుటుంబసభ్యులు రూ 1,11,116లను విరాళం అందజేశారు. ఈ మేరకు వారు నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు

- వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులతో కిక్కిరిసిన సీఎం రోడ్డు
- రైతులను ఆదుకోవాలని డిమాండ్

నందిగామటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా పెద్దసంఖ్యలో తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో నందిగామలోని గాంధీ సెంటర్, సీఎం రోడ్డు జన సంద్రంగా మారింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌తోపాటు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో ర్యాలీలో పాల్గొన్నారు. పోలీసులు సృష్టించిన అడ్డంకులను అధిగమించి అన్నదాత పోరు కార్యక్రమంలో పాల్గొన్నారు. భారీఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులు, రైతుల నినాదాలతో నందిగామ హోరెత్తింది.



నందిగామ ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, జగ్గయ్యపేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నేతలు



అన్నదాత పోరు ర్యాలీకి భారీగా తరలివచ్చిన రైతులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజలు



నందిగామ సీఎం రోడ్డులో ర్యాలీగా వెళ్తున్న రైతులు, నాయకులు



జనంతో కిక్కిరిసిన నందిగామ గాంధీసెంటర్



నందిగామలో ర్యాలీకి హాజరైన జనసందోహంలో ఓ భాగం

భారీగా మోహరించిన పోలీసులు



వైఎస్సార్ సీపీ నేతలను ఆర్డీవో కార్యాలయంలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న పోలీసు బలగాలు

నందిగామటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించారు. పోలీసులతో పాటు స్పెషల్ ఫోర్స్ బలగాలతో గాంధీ సెంటరు నిండిపోయింది. అంతేకాకుండా గతంలో ఎన్నడూలేని విధంగా వాటర్ గన్ లారీని సైతం గాంధీసెంటరులో ఉంచటంతో ప్రజలు ఒకింత ఆందోళన చెందారు. ఆర్డీవో కార్యాలయంకు ఇరువక్కలా రోడ్డును బారికేడ్‌లతో మూసేయటంతో ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, కోర్టుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అడుగడుగునా ఆంక్షలు..అయినా ఆగని రైతులు



బారికేడ్లు అడ్డుపెట్టి మహిళా నాయకులు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



వాటర్‌గన్ వ్యాన్‌ను అడ్డుగా పెట్టి నాయకులు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

నందిగామరూరల్: ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతన్నకు బాసటగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీఎమ్మెల్యేలు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, మల్లాది విష్ణు, నల్లగట్ల స్వామిదాసు, వెల్లంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ శైలజారెడ్డి, జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడుగడుగునా అడ్డుకుంటూ ముందుకు సాగనీయలేదు. నందిగామలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం మొదలు సీఎం రోడ్డు, పోలీస్‌స్టేషన్ సమీపంలో, మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు బారికేడ్‌లు అడ్డుపెట్టి అడ్డుకునే యత్నం చేశారు. గాంధీ సెంటరులో ఏకంగా వాటర్‌గన్ వ్యాన్‌ను అడ్డంపెట్టి బారికేడ్‌లు, తాళ్ల సహాయంతో అడ్డుకునేందుకు యత్నించగా రైతులు, పార్టీ కార్యకర్తలు ఏమాత్రం తగ్గకుండా రైతులను న్యాయం చేయాల్సిందేనంటూ తమ ఆందోళనను కొనసాగించారు. ఆర్డీవో కార్యాలయంలోకి కేవలం కొద్దిమంది ముఖ్యనాయకులను మాత్రమే అనుమతించడంతో మిగిలిన నాయకులు, కార్యకర్తలు, రైతులు రోడ్డుపై బైఠాయించి తీవ్రనిరసన వ్యక్తం చేశారు. ర్యాలీకి అనుమతి లేదని నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలో పాల్గొంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించినా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, రైతులు ఏమాత్రం ఖాతరు చేయకుండా అన్నదాత పోరులో కదంతొక్కారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద అడ్డుపెట్టిన బారికేడ్లు, డ్రమ్ములు



పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తంచేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పార్టీ శ్రేణులు, రైతులకు కృతజ్ఞతలు

ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్: ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతన్నకు బాసటగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమ విజయవంతానికి కృషిచేసిన ప్రతిఒక్కరికి ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయన్నారు. యూరియా విషయంలో రైతులు పడుతున్న ఇబ్బందులపై పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాడుతున్నట్లు తెలిపారు. అన్నదాత పోరు కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, వైఎస్సార్ నేతలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమని, పార్టీకి అండగా నిలిచిన ప్రతిఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్‌మస్తాన్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, మంచాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నందిగామటౌన్: పట్టణంలోని 11కేవీ విద్యుత్ కేంద్రం ఫీడర్–2 పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్‌లో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. పట్టణంలోని నెహ్రూనగర్, పాతబైపాస్ రోడ్డు, పాత బస్టాండ్, తదితర ప్రాంతాలలో ఉదయం ఎనిమిద గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు:వీఆర్వోలు గ్రామాలలో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రవికుమార్ ఆదేశించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మండలంలోని వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉంటూ రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

12న కంచికచర్ల మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సీఐ



పరిటాల(కంచికచర్ల): గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నందిగామ రూరల్ సీఐ చవాన్‌దేవ్ హెచ్చరించారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలోని పరిటాల గ్రామంలో మంగళవారం క్విక్ రియాక్షన్ టీం, టాస్క్‌ఫోర్స్, ఏపీఎస్‌పీ టీం, వజ్రా వెహికిల్ సిబ్బంది పర్యటించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి, సహనంతో ఉండాలని కోరారు. ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు పాల్పడవద్దన్నారు. శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లితే సహించేది లేదని అవసరమైతే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పోలిశెట్టి విశ్వనాథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పనుల పరిశీలన



గ్రోమోర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

నందిగామరూరల్: రీసర్వే పనుల్లో ఎటువంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియా పేర్కొన్నారు. మండలంలోని పెద్దవరం, చందర్లపాడు, కోనాయపాలెం గ్రామాల్లో సాగుతున్న గ్రామ సరిహద్దుల స్థిరీకరణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత కుటుంబాలకు సమాచారం అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జేసీ ఇలక్కియా మండలంలోని అడవిరావులపాడు చౌకధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్డుదారులకు నాణ్యమైన సరుకులను పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు. అదేవిధంగా నందిగామలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. జేసీ వెంట ఆర్డీవో బాలకృష్ణ, తహసీల్దార్ సురేష్‌బాబు ఉన్నారు.

అన్నదాత పోరుకు తరలిన శ్రేణులు



నందిగామలో గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జగ్గయ్యపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

జగ్గయ్యపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నందిగామలో జిల్లాస్థాయిలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా తరలివెళ్లారు. ఉదయం సమయంలో ముఖ్య నాయకులను హౌస్ అరెస్ట్ చేసేందుకు పోలీసులు వెళ్లగా కొంతమంది నాయకులు అందుబాటులో లేకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి, చిల్లకల్లు వద్ద పోలీస్ పహారా నిర్వహించి అన్నదాత పోరుకు వెళ్లకుండా అడ్డుకునే యత్నం చేసినప్పటికీ రైతులు, నాయకులు ఏమాత్రం లెక్కచేయకుండా అన్నదాత పోరుకు హాజరయ్యారు. నందిగామ గాంధీసెంటరులోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, నాయకులు మాతంగి నాగబాబు, మండవ శ్రీనివాస్‌గౌడ్, బజారు సాయి, నాయుడు, సయ్యద్ షాఉద్దీన్, కోలా రామారావు, పారిశ్రామికవేత్త మట్టా ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలం నుంచి..

పెనుగంచిప్రోలు: నందిగామలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి పెనుగంచిప్రోలు మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలతోపాటు రైతులు తరలివెళ్లారు. అన్నదాత పోరుకు తరలివెళ్లినవారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ, బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల రామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, రైతువిభాగం అధ్యక్షులు చుంచు రమేష్, నియోజకవర్గ ఎస్సీసెల్, వాణిజ్య విభాగం, ట్రేడ్ యూనియన్, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులు కీసర లోకేశ్వరరావు, దేరంగుల శ్రీనివాసరావు, మెండెం రామారావు, బోశెట్టి బ్రహ్మం, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.



ప్లకార్డు ప్రదర్శిస్తున్న కంచికచర్ల జెడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: నందిగామలో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి వీరులపాడు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పలు వాహనాలలో తరలివెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో నందిగామకు తరలివెళ్లి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. కార్యక్రమంలో నాయకులు షహనాజ్ బేగం, పచ్చాల కోటేశ్వరరావు, శీలం రమణారెడ్డి, పూలా పుల్లయ్య, షేక్ నాగుల్‌మీరా, నువ్వుల విశ్వనాదం, జంగా కోటిరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీలు సుస్థిర అభివృద్ధి సాధించాలి



పెనుగంచిప్రోలు: పంచాయతీలు సుస్థిర అభివృద్ధి సాధించాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ సూచించారు. పంచాయతీ పురోగతి సూచికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ జి.శ్రీను మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి సరైన ప్రణాళికలు తయారుచేసుకోవడంతోపాటు పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఆశయాలను వివరించారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఏఓ కె.సిద్ధారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: ఉత్తమ పంచాయతీల రూపకల్పనకు నిర్వహించాల్సిన విధివిధానాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ పంచాయతీల రూపకల్పన విధివిధానాలపై మంగళవారం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, అన్నిశాఖల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన 200 ప్రశ్నలకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెసరమల్లి రమాదేవి, వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించారు.